క్లుప్తంగా

పొరపాట్లకు తావివ్వొద్దు..

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పోలింగ్ కోసం సిద్ధం చేసిన ఈవీఎం కిట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి: పోలింగ్ సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత పీఓ, ఏపీఓలపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించనున్న పీఓ, ఏపీఓలకు గరివిడిలో గల ఎస్‌డీఎస్ అటానమస్ కళాశాలలో శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించి, పోలింగ్‌కు సిద్ధమైన ఈవీఎం కిట్లను పరిశీలించారు. అంతకుముందు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మే 13న జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో సిబ్బంది చాలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్‌కు సంబంధించిన నిబంధనలను పూర్తి అవగాహన కల్పించుకోవాలని సూచించారు. పోలింగ్ నిబంధనలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఎలాంటి పొరపాట్లు జరగవని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య యువత

గజపతినగరం: మండల కేంద్రంలోని వినాయక ఆలయ సమీపంలో ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురు వారం ప్రారంభించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

● డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



36వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మహిళలు

విజయనగరం: అధికారమే పరమావధిగా చంద్రబాబు అండ్ కో విడుదల చేసిన మేనిఫెస్టోని నమ్మి మోసపోవద్దని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. వైఎస్సార్ సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా నగరంలోని 36వ డివిజన్ మజ్జిపేటలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రావణికి మద్దతుగా వందలాది మంది మహిళలు ప్రచారంలో పాల్గొనగా... ఇంటింటికి వెళ్లి కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా కోలగట్ల వీరభద్రస్వామికి మద్దతుగా ప్రజాస్పందన అనూహ్యంగా వస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన, స్థానికంగా కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అభివృద్ధే ఇందుకు కారణమని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కోలగట్లను మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాజాం: మండలంలోని కంచరాం, ఆగూరు, దోసరి, గడిముడిదాం తదితర గ్రామాల్లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించిన మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. పోలింగ్ రోజున అన్ని కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

బొబ్బిలి: ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి, స్థానిక వేణుగోపాల ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ తెలిపారు. ఇదే విషయమై ఆమె విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు చేపడుతున్నామని, తొలుత ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్లను పొందుపరిచే ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన నియోజకవర్గంలోని మొత్తం ఆరుగురు ఓటర్లకు సంబంధించి, హోమ్ ఓటింగ్ చేపట్టనున్నామన్నారు. ఈ నెల 8వ తేదీన ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తామన్నారు.

ప్రజా సంక్షేమం,అభివృద్ధే ధ్యేయం

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాం
- గజపతినగరం నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.1,800 కోట్లు వెచ్చించాం
- రూ.90 కోట్లతో ఇంటింట కుళాయిల పనులు చేపడుతున్నాం
- 36 గ్రామాల రోడ్లను పునరుద్ధరించాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



దేవుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: ప్రజా సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా పని చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని, సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలను కోరారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ స్తులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు.నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రచార సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగనంత సంక్షేమం, అభివృద్ధిని ఈ58 నెలల పాలనలో నియోజకవర్గంలో చేశామన్నారు. నియోజకవర్గంలో గోతులు తేలి అధ్వానంగా తయారైన రోడ్లకు గత ప్రభుత్వంలో మరమ్మతులు చేయలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 36 గ్రామాల రోడ్లను పునరుద్ధరించా మని చెప్పారు. దేవుపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామం కొండవానిపాలెంకు రూ.3.15 కోట్లతో తారురోడ్డు వేశామని తెలిపారు.అలాగే అగ్నిప్రమాదం లో గ్రామంలో 40 ఇళ్లు కాలిపోయాయని, బాధిత కుటుంబాలన్నింటికీ ఇళ్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసవిలో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి అవస్థలు పడేవారని, నేడు ఆపరిస్థితి ఏ గ్రామంలోనూ లేదన్నారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన పనులకు రూ.90 కోట్లు మంజూరు కాగా, 50 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని చెప్పారు. కొన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని, త్వరలోనే పనులు పూర్తవుతాయ ని వివరించారు.

దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాం

గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో ఎన్నో ఏళ్ల కలగా మిగిలిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే అప్పలనరసయ్య చెప్పారు. అలాగే బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపామన్నారు. కోట్లా రూపాయల విలువ చేసే భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. పట్రువాడ వద్ద చంపావతి నదిపై వంతెన నిర్మాణం చేపట్టామని, నెలివాడలో జిల్లాస్థాయి అగ్రిల్యాబ్‌ను రూ.3.50 కోట్లతో నిర్మించామని, అక్కడే వరి విత్తన సేకరణ, ప్రోసెసింగ్ కోసం గొడౌన్ నిర్మించామని వివరించారు. ఇంటింటికీ పారదర్శకంగా పథకాలు అందించామన్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమం గత ప్రభుత్వ హయాంలో జరిగిందా అని ప్రజలను ప్రశ్నించారు. గజపతినగరంలో గల 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేసి రూ.17 కోట్లతో భవనాలు నిర్మిస్తున్నామని, నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దామని చెప్పారు. నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఈ ఐదేళ్లలో రూ.1,800 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై ప్రతిపక్షాలు అవసర రాద్ధాంతం చేస్తున్నాయని, ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్ సీఎంగా కొనసాగాలని, మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బి.వి.ప్రభుజీరాజు, మండల పార్టీ అధ్యక్షులు బోడ్డల చిన్నం నాయుడు,యువ నాయకులు బొత్స సాయి గురునాయుడు,జెసిఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ,దేవుపల్లి ఎంపిటీసీ రాపాక వెంకటలక్ష్మి ,నాయకులు ఇట్లా తిరుపతిరావు,జెసిఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ, మాజీ ఎంపిపి బండారు బంగారం,రాపాక సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార సభకు హాజరైన ప్రజలు

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచాం
- రూ.230 కోట్లతో ఇంటింట కుళాయిల పనులు చేశాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



దాసుళ్లపాలెం గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో సాకారం చేసి, అవినీతి రహిత, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వ దించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అభ్యర్థించారు. మండలంలోని దాసుళ్లపాలెం, తలారి, కొట్యాడ, నాయుడుపేట, వీరభద్రపేట గ్రామాల్లో ఎమ్మెల్యే కడుబండి ఆయన భార్య డాక్టర్ మధుతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే దంపతులకు గజమాలలు వేసి, హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రచార సభల్లో ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి రెండు కళ్లుగా భావించి సీఎం జగన్ పాలన సాగించారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు గ్రామాల్లోనే అందిస్తున్నామని, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా ఉన్న ఊరిలోనే రైతులకు విత్తనాలు, ఎరువులను రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని వివరించారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామని, నియోజకవర్గంలో రూ.230 కోట్లతో ఇంటింటికీ కుళాయిల పనులు చేశామని, గ్రామాలను అనుసంధానం చేస్తూ తారురోడ్లు నిర్మించామని, పాడైన రోడ్లను పునరుద్ధరించామని పేర్కొన్నారు. ఇంటి వద్దకే పింఛ న్, రేషన్ సరుకులు అందించామని చెప్పారు. ఇంతటి అభివృద్ధి,సంక్షేమం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరో మారు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతామని అన్నారు. ఈప్రాంతాన్ని టీడీపీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కుటుంబం సుమారు 40 ఏళ్లు పాలించిందని, వారు చేసిన అభివృద్ధి, సంక్షేమం ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు .ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ముమ్మన ధనలక్ష్మి, కొట్యాడ దేవి, వై.కిశోర్‌కుమార్, నాయకులు ముమ్మన ప్రసాదరావు, కొట్యాడ మహేష్,ఎర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే విజయం



నమూనా ఈవీఎం బ్యాలెట్ చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- బ్యాలెట్ నంబర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి బూత్ కమిటీలు, వలంటీర్లు, గ్రామ పెద్దలు సమన్వయంతో పని చేయడం ద్వారా చక్కని ఫలితాలు సాధించవచ్చునని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో చీపురుపల్లి, గరివిడి మండలాల బూత్ కమిటీలు, వలంటీర్లు, సర్పంచ్‌లు, గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం అందరి కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికే బ్యాలెట్‌లో గుర్తులు, నంబర్లు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణకు 3వ నంబర్, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌కు 3వ నంబర్ వచ్చిందని.. ఈ నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే పార్టీ అధిష్టానం నుంచి నమూనా బ్యాలెట్ వచ్చిందని... దాన్ని ఓటర్లకు చూపించి ఎలా ఓటు వేయాలో వివరించాలని సూచించారు. కొద్ది రోజులు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో బూత్ కమిటీలు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, దన్నాన జనార్దన రావు, మంగళగిరి సుధారాణి, కరుమజ్జి శ్రీనివాసరావు, ఇప్పిలి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా



జామి: పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న భీమసింగి పంచాయతీ వలంటీర్లు

దత్తిరాజేరు: మండలంలోని చినకాద, షికారుగంజి, గడసాం.పాపయ్యవలస గ్రామాలకు చెందిన 46 మంది వలంటీర్లు గురువారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ చంద్రకుమారికి అందజేశారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 146 మంది రాజీనామా పత్రాలు అందజేశారని ఎంపీడీఓ తెలిపారు.

జామి మండలంలో...

జామి: మండలంలోని భీమసింగి పంచాయతీలో 25 మంది, కుమరాం పంచాయతీలో 18 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశా రు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీల కార్యదర్శి గోపాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని చెప్పారు.

గుర్ల మండలంలో..

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజుపేటకు చెందిన పది మంది గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి క్రాంతిప్రియకు అందజేశారు. స్వచ్ఛందంగా పనిచేస్తున్న వాలంటీర్లపై టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడంతో తామ అందరు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

చినమానపురంలో..

గంట్యాడ: మండలంలోని చినమానపురం గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శికి గురువారం అందజేశారు.

నిమ్మలవలసలో 11 మంది...

చీపురుపల్లి: మండలంలోని నిమ్మలవలస సచివాలయం పరిధిలో 11 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను గురువారం చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి సింహాచలం ద్వారా ఎంపీడీఓకు అందజేశారు.

హోం ఓటింగ్‌కు 34 మంది గుర్తింపు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హోం ఓటింగ్‌కు గజపతినగరం నియోజకవర్గంలో 34 మంది తమ అంగీకారపత్రాలు అందజేశారని నియోజకవర్గ హోం ఓటింగ్ ప్రత్యేక అధికారి, బొండపల్లి డీటీ పి.హరి గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాలతో పాటు, జామి మండలంలోని 13 పంచాయతీల పరిధిలో 3,780 మంది దివ్యాంగులతో పాటు, 85 ఏళ్లు దాటిన 886 మంది వృద్ధులను గుర్తించామని చెప్పారు. వారందరి దగ్గరికీ క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు వెళ్లి ఓటింగ్‌కు కేంద్రాలకు రాగలరా, లేక హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించాలా అని వారి అభిప్రాయం తీసున్నామన్నారు. వీరిలో 34 మంది హోం ఓటింగ్ కావాలని కోరుతూ బీఎల్‌ఓలకు అంగీకార పత్రాలను అప్పచెప్పారని పేర్కొన్నారు.

ఈ పాపం చంద్రబాబుదే...



పింఛన్ డబ్బుల కోసం గజపతినగరంలోని ఎస్‌బీఐ సేవా కేంద్రం వద్ద క్యూలో ఉన్న లబ్ధిదారులు



గజపతినగరంలో బ్యాంకు వద్ద నిల్చోలేక కింద కూర్చున్న వృద్ధుడు

గజపతినగరం రూరల్: తుఫాన్ వచ్చినా, వరదొచ్చినా, కరోనా వంటి విపత్కర సమయంలో సైతం అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు ఇంటి వద్దే పింఛన్ అందజేసేవారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, అండ్‌కో కుటిల రాజకీయాల వల్ల వలంటీర్లు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ ప్రభావం పింఛన్ లబ్ధిదారులపై పడింది. రెండు మాసాలుగా పింఛన్ పొందేందుకు అవ్వాతాతలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ చేయగా, ఈ నెల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు గురువారం తమ గ్రామాల నుంచి మండుటెండలో మండల కేంద్రంలోని బ్యాంకులు, పక్క గ్రామాల్లోని బ్యాంక్ సేవా కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్దీ క్యూలో నిలబడి చివరికి కౌంటర్ వద్దకు వచ్చేసరికి నీ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల డబ్బులు ఇవ్వలేమని సిబ్బంది చెప్పేసరికి వృద్ధులు ఉసూరుమన్నారు. చంద్ర బాబు కుట్రవల్లే తమకు ఇబ్బందులని పింఛన్‌దారులు మండిపడుతున్నారు. ఈ పాపం చంద్రబాబుదేనని, మా లాంటి వారి ఉసురు తగలక మానదని, పలువురు వృద్ధులు శాపనార్థాలు పెట్టారు.

8 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చా..

పింఛన్ డబ్బులు బ్యాంకు ఖాతాల జమచేశారని చెబితే వాటిని తీసుకునేందుకు మాగ్రామం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న గజపతినగరానికి ఉదయాన్నే వచ్చాను. 9గంటలకు క్యూలో నిల్చుంటే పింఛన్ తీసుకునేందుకు రెండు గంటలు పట్టింది. వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే వారు. ఇలాంటి బాధలు మేం పడలేం. జగన్‌బాబు మళ్లీ సీఎం అయితే ఎప్పటిలా ఇంటి వద్ద పింఛన్ తీసుకోవ చ్చు.

– పొంద్రంకి పైడితల్లి, వితంతుపింఛన్‌దారు, సీతారామపురం

బ్యాంకుల వద్ద పడిగాపులు

బొండపల్లి: సామాజిక పింఛన్ డబ్బులు కోసం అవ్వాతాతలు గురువారం మండుటెండల్లో బ్యాంకుల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. చంద్రబాబు తన అనుచరులతో వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు ఫలితంగా వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం పింఛన్‌దారులు 8,052 మంది ఉండగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 6,075 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం పింఛన్ డబ్బులను 1వ తేదీన జమచేసింది, బ్యాంకు ఖాతాలు లేని వారితో పాటు ఇళ్ల నుంచి బయటకు రాలేని 1,977 మంది ఇళ్లకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయిన వారు వాటిని తీసుకునేందుకు బ్యాంకుల వద్ద బారులు తీరారు.

చెప్పింది చేసే జగనన్నకే ఓటువేద్దాం..



సీఎం జగన్ మాటమీద నిలబడే వ్యక్తి అని, ఆయన ఒక మాట చెప్పారంటే, ఖచ్చితంగా చేసి తీరుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స సత్యనారాయణ, బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు, విజయనగరం, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థులు బెల్లాన చంద్రశేఖర్, బొత్స ఝాన్సీలక్ష్మి తరఫున గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, ఏ హామీ కూడా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. మళ్లీ అదే తరహాలో మోసం చేయాలని చూస్తున్నాడని, ఆయన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మాటతప్పని నాయకుడు జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



మెరకముడిదాం: సిరియాలపేటలో నిర్వహించిన ప్రచార సభలో మాట్లాడుతున్న బొత్స సందీప్‌బాబు



గజపతినగరం: గజపతినగరంలో ప్రచారం నిర్వహిస్తున్న బొత్స సాయిగురునాయుడు



శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో ప్రచారం చేస్తున్న నాయకులు



శృంగవరపుకోట: పెదఖండేపల్లిలో ఇంటింట ప్రచారం చేస్తున్న జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, తదితరులు



గుర్ల: పల్లిగండ్రేడులో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎంపీపీ పొట్నూరు ప్రమీల



బొండపల్లి: కొండకిండాంలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



గజపతినగరం రూరల్: దోలపాలెంలో ఉపాధి పనుల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ తవుడు, తదితరులు



గంట్యాడ: తాటిపూడిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పారావు